నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, సోమవారం 18 నవంబర్ 2024 | KARIMNAGAR

గ్రూప్-3 మొదటి రోజు ప్రశాంతం

కలెక్టరేట్, నవంబర్ 17: టీజీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్ష ఉమ్మడి జిల్లాలో మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల నిబంధనలపై అధికార యంత్రాంగం ముందుగానే సూచనలు చేయడంతో అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. నిమిషం నిబంధన ఉండడంతో మరికొందరు చేరుకోలేక వెనుదిరిగిపోయారు. హాజరైన వారి హాల్‌టికెట్, గుర్తింపు కార్డులను సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి లోనికి పంపించారు. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధించడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగలేదు.

జిల్లా	మొత్తం అభ్యర్థులు	పేపర్-1 రాసినవారు	పేపర్-2 రాసినవారు
కరీంనగర్	26,415	14,104	14,009
జగిత్యాల	10,656	5,563	5,544
సిరిసిల్ల	7,062	3,808	3,794
పెద్దపల్లి	8,947	4,557	4,440
మొత్తం	53,080	28,029	27,787

పెద్దపల్లి కమాన్: పెద్దపల్లి ట్రినిటీ డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కాంగ్రెస్‌వి 420 మాటలే..

- ఆరు గ్యారెంటీలు అబ్రకదబ్రే
- ఏడాది కావస్తున్నా వాటి ఆలోచనే లేదు
- మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌కు ఆ ధ్యాసే లేదు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

కమాన్‌పూర్, నవంబర్ 17 : ''ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీవి 420 మాటలే.. ఆరు గ్యారెంటీలు అబ్రకదబ్రే.. ఏడాది కావస్తున్నా వాటి ఆలోచనే లేదు.. మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌కు ఆ ధ్యాసే లేదు'' అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రజా వంచన దినోత్సవాల్లో భాగంగా ఆదివారం కమాన్‌పూర్ మండలంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామంటూ ఇంటింటికీ తిరిగి సంతకాలు పెట్టి మరీ ప్రచారం చేశారని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు చేస్తామని చెప్పి ప్రజలను ఆగం చేశారని, ఇప్పుడు ఏడాది కావస్తున్నా ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్కటైనా పూర్తిగా అమలు చేశారా? అని ప్రశ్నించారు. గ్యారెంటీలతో పాటు 420 హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం విచిత్రంగా ఉందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పథకాల అమలులో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే అబద్ధాలు, మోసమని ధ్వజమెత్తారు. సన్నరకం ధాన్యానికి బోనస్ అంటూ రైతును మభ్యపెడుతున్నారని, ఇప్పటివరకు రైతు రుణమాఫీ వందశాతం చేయలేదని విమర్శించారు. ఇక్కడ మోసం చేసింది చాలక మహారాష్ట్ర ప్రజలను కూడా మోసం చేయడానికి వెళ్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, యూత్ మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, మాజీ జడ్పీటీసీ మేకల సంపత్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొండ వెంకటేశ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, పీఎంసీ వైస్ చైర్మన్ చింతం తిరుపతి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్ర సాధనలో కెప్టెన్‌ది ముఖ్యపాత్ర

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- ఘనంగా లక్ష్మీకాంతారావు పుట్టినరోజు వేడుకలు

రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకుంటున్న ఎమ్మెల్యే గంగుల, బీఆర్‌ఎస్ శ్రేణులు

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 17 : బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, . రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు స్వరాష్ట్ర సాధన కోసం కేసీఆర్‌తో కలిసి నడిచి ముఖ్య పాత్ర పోషించారని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు కొనియాడారు. ఆదివారం కెప్టెన్ పుట్టిన రోజు వేడుకలను నగరంలో బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే, మేయర్‌తోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ దవాఖానలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా దేశానికి, రాష్ట్రానికి కెప్టెన్ ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు అమరావతి సలీం, మేచినేని అశోక్‌రావు, నయీం, శౌకత్ అలీ, జి.మహేందర్, ఎ.రాజు, ఫిరోజ్, నరేశ్, నజీర్, నాని పాల్గొన్నారు

జాతీయ వన్డే టీంలోకి శ్రీవల్లి

- హెచ్‌సీఏ జట్టు తరఫున ఫాస్ట్ బౌలర్‌గా ఎంపిక
- ఉమ్మడి జిల్లా క్రికెట్‌లో తొలి క్రీడాకారిణిగా చరిత్ర

బౌలింగ్ చేస్తున్న శ్రీవల్లి

కరీం'నగరానికి' చెందిన కట్ట శ్రీవల్లి అరుదైన ఘనత సాధించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి సీనియర్ జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికైన మొదటి మహిళా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. హెచ్‌సీఏ జట్టు తరఫున ఫాస్ట్ బౌలర్‌గా ఎంపిక కాగా, వచ్చే నెల 4న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో బరిలోకి దిగబోతుండగా, సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

కొత్తపల్లి, నవంబర్ 17 : కరీంనగర్‌కు చెందిన క్రికెట్ క్రీడాకారిణి కట్ట శ్రీవల్లి బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ) సీనియర్ మహిళల వన్డే క్రికెట్ జట్టులో చోటు సంపాదించింది. జిల్లా కేంద్రంలోని శ్రీపురంకాలనీకి చెందిన కట్ట ఉమారాణి లక్మారెడ్డి దంపతుల చిన్న కూతురు శ్రీవల్లి ఫాస్ట్‌బౌలర్‌గా జాతీయ క్రికెట్ పోటీల్లో హైదరాబాద్ క్రికెట్ జట్టుకు(హెచ్‌సీఏ) ఎంపికైంది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన పలు హెచ్‌సీఏ క్రికెట్ పోటీల్లో తన ఫాస్ట్ బౌలింగ్‌తో అత్యధిక వికెట్లుతీసి మొదటి స్థానంలో నిలిచింది. ఆదివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో సమావేశం అనంతరం తుది జట్టును ప్రకటించగా, అందులో శ్రీవల్లి ఎంపికైంది. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో డిసెంబర్4న జరగనున్న మహిళల వన్డే క్రికెట్ టీంలో హెచ్‌సీఏ హైదరాబాద్ జట్టుకు ఫాస్ట్‌బౌలర్‌గా ఆడనుండడం విశేషం. ఈ సందర్భంగా శ్రీవల్లిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీ ఆగం రావు, ఎన్ మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు పీ మనోహర్ రావు, కే మహేందర్ గౌడ్, కోశాధికారి డీ శ్రవణ్ కుమార్, కోచ్‌లు డీ శ్రీనివాస్, శ్రావణ్, కిరణ్, వరుణ్ అభినందించారు.

తమ్ముడు సెల్‌ఫోన్ ఇవ్వలేదని..

- ఉరేసుకుని అక్క ఆత్మహత్య

రాంనగర్, నవంబర్ 17 : తమ్ముడు సెల్‌ఫోన్ ఇవ్వలేదన్న కారణంతో క్షణికావేశంలో అక్క ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కరీంనగర్‌లోని గోదాంగడ్డలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోదాంగడ్డకు చెందిన ఓ బాలిక(17) శనివారం సాయంత్రం సెల్‌ఫోన్ ఇవ్వాలని తన తమ్ముడితో గొడవ పడింది. అతడు సెల్ ఫోన్ ఇవ్వకపోవడంతో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న ఇనుప పైపునకు తన చున్నీతో ఉరేసుకున్నది. కొన ఊపిరితో ఉన్న బాలికను గమనించిన తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

సేద్యానికి.. ఉపాధికి

దోస్తీ కలిసేనా..?

వ్యవసాయరంగంలో రోజురోజుకూ కూలీల కొరత వేధిస్తున్నది. సేద్యంలో రైతన్నపై పెట్టుబడుల భారం పెరిగిపోతున్నది. మరోవైపు ఉపాధి హామీలో పొలం పనులు మాత్రమే వచ్చిన రైతు కూలీలకు పని కల్పించలేని పరిస్థితులు నెలకొనగా, వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా పొలం పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించాలన్న నీతి ఆయోగ్ ఆలోచన తెరమరుగవుతున్నది. రెండింటినీ అనుసంధానిస్తే మంచి ఫలితాలుంటాయని ఆదేశాలు, సలహాలు, సూచనలు ఇచ్చి ఎనిమిదేండ్లు అవుతున్నా కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉన్నది. మరోవైపు సేద్యపు పనులను ఈజీఎస్ స్కీంతో కలపాలని మొదటి నుంచీ కోరుకుంటూ వచ్చిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సైతం, 2022లోనే అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి పంపినా స్పందన కరువైంది. ఈసారైనా ఈ రెండింటికీ దోస్తీ కలిస్తే అటు రైతుకు, ఇటు కూలీలకు మేలు జరుగుతుందని, ఆ దిశగా కేంద్రం ఆలోచన చేయాలని కర్షక, కార్మికలోకం కోరుతున్నది.

- జగిత్యాల, నవంబర్ 17(నమస్తే తెలంగాణ)

జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ వద్ద పొలంలో నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు (ఫైల్)

- వ్యవసాయ పనులు, ఈజీఎస్ పథకం కింద చేస్తే ఎంతో మేలు
- రెండింటినీ అనుసంధానిస్తే మంచి ఫలితాలుంటాయని నీతి అయోగ్ చెప్పినా మారని కేంద్రం వైఖరి
- మొదటి నుంచీ ఇదే కోరుకుంటూ వచ్చిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్
- 2022లోనే అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం
- పొలం పనులు ఉపాధి స్కీంలో చేస్తే రైతన్నలపై తగ్గనున్న పెట్టుబడి భారం
- కూలీలకు ఉపాధికి పెరుగనున్న అవకాశాలు

'వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలి. అప్పుడే అటు రైతు, ఇటు కూలీకి మేలు జరుగుతుంది. భారత్ ఎంత అభివృద్ధి చెందినా, వ్యవసాయ రంగమే ఇప్పటికీ దేశానికి ప్రధాన రంగంగా ఉంది. 30 శాతం మంది నేరుగా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుండగా మరో 20 శాతం మంది పరోక్షంగా బతుకుతున్నారు. దేశ జాతీయ, తలసరి ఆదాయాల్లో వ్యవసాయ రంగ వాటానే అగ్రస్థానంలో ఉన్నది. ఇదిలా ఉంటే దేశంలో కోట్లాది మంది కూలీలకు పని దొరకడం లేదన్నది మరో నిజం. ప్రతి మనిషికి ఉపాధి చూపాలని, ఏడాదిలో కనీసం 150 రోజులు పని కల్పించేలా ఉపాధి హామీ పథకాన్ని తెచ్చారు. దేశంలో అతి ఎక్కువ సంఖ్యలో కూలీలు ఆధారపడి బతుకుతున్నది వ్యవసాయ రంగంపైనే. సాంకేతిక నైపుణ్యం పెరిగి, వ్యవసాయ రంగంలో యాంత్రికీకరణ ఎంతగా వృద్ధి చెందినా, గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది మంది రైతు కూలీలు ఉన్నారు. వారందరికీ పని దొరకాలంటే ఉపాధి పథకాన్ని వ్యవసాయ రంగంతో అనుసంధానించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేంద్రం ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగంతో అనుసంధానిస్తూ ఉత్తర్వులు జారీ చేసి, మార్గదర్శకాలు విడుదల చేయాలి. ఇది 2016లో కేంద్ర నీతి అయోగ్ చెప్పిన మాటలు, ఇచ్చిన ఆదేశాలు.

2022లోనే అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం

వ్యవసాయ రంగాన్ని, ఉపాధి పథకంతో అనుసంధానించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రం రెండేండ్ల క్రితమే తీర్మానించింది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా విజృంభించి, దేశాల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై కూలీలకు ఉపాధి లభించని పరిస్థితి ఉత్పన్నమైన విషయం తెలిసిందే. కరోనా విపత్తు తర్వాత పలు సందర్భాల్లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత రైతు కూలీలను, రైతులను ఆదుకునేందుకు ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగంతో అనుసంధానించాల్సిన అవసరం ఉందని ప్రకటిస్తూ వచ్చారు. ఈ మేరకు స్వయంగా కేసీఆర్ ప్రధాని నరేంద్ర మోదీని కలిసి విన్నవించడంతోపాటు, ఈ విషయమై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి నివేదించినా పట్టించుకోలేదు.

75 శాతం రైతు, 25 శాతం ప్రభుత్వం భరించేలా పథకం

వ్యవసాయ రంగాన్ని ఉపాధిహామీ పథకంతో అనుసంధానం చేసే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నీతి అయోగ్ పేర్కొంది. వ్యవసాయ కూలీలకు, ముఖ్యంగా మహిళా కూలీలకు ఉపాధి కల్పించే విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని అభిప్రాయపడింది. పంట పెట్టుబడిలో వ్యవసాయ కూలీలకు ఉపాధి పథకం ద్వారా కూలి చెల్లించేలా చూడాలని పేర్కొంది. పెట్టుబడిలో 75 శాతం రైతు పెట్టుకునేలా ఉండాలని, 25 శాతం ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. వ్యవసాయ రంగంలో ఇప్పటికీ దుక్కులు దున్నడం, వరినాటు వేయడం, కలుపు తీయడం, పత్తి గింజలు అలకడం, పత్తి ఏరడం, పత్తి క్రాసింగ్ వంటి పనులు ఇంకా వ్యవసాయకూలీలే చేస్తున్న విషయం తెలిసిందే. జగిత్యాల జిల్లాలో వానకాలం, యాసంగిలో సేద్యం అధికంగా జరుగుతున్న నేపథ్యంలో కూలీలకు అధిక ప్రాధాన్యత ఏర్పడింది. రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు ఒక్కో కూలీకి చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఆ మొత్తాలను ఉపాధి హామీ కింద ప్రభుత్వమే చెల్లించాలని, అలాగే రైతు చేపట్టే వ్యవసాయ ఆధారిత పనులను సైతం ఉపాధి పథకంలో చేయాలని సూచించింది. ఇలా చేయడం వల్ల రైతుపై కూలీల భారం తగ్గడంతో పాటు, కూలీలకు ఉపాధి లభిస్తుందన్నది నీతి అయోగ్ ఉద్దేశం.

వ్యవసాయ ఆధారిత నిర్మాణాలకు పథకం వర్తింపు

రైతు కూలీలకు, ముఖ్యంగా మహిళా రైతు కూలీలకు వ్యవసాయ పనులు చేసే అవకాశం కల్పించడంతో పాటు, వ్యవసాయ ఆధారిత ఇతర పనులకు పథకాన్ని వర్తింపజేయాలని నీతి అయోగ్ అభిప్రాయపడింది. కూరగాయల సాగు అభివృద్ధి కోసం వేసే పందిళ్లు, షెడ్ల నిర్మాణం, నీటి కాల్వలు, వ్యవసాయ బావుల తవ్వకం, బావుల్లో పూడికతీత, గ్రామాల్లో సమష్టిగా రైతులకు నీటి వసతిని కల్పించే ఫీడర్ చానల్స్, కుంటల పూడికతీత లాంటి పనులను పథకంలో భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

ఉపాధి కూలీలకు పెద్ద ప్రయోజనం

ఉపాధి హామీ పథకాన్ని, వ్యవసాయ రంగంతో అనుసంధానించడం వల్ల జిల్లాకు పెద్ద మొత్తంలో ప్రయోజనం చేకూరుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. దాదాపు 11 లక్షల జనాభాతో ఉన్న జిల్లాలో 3,36,076 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో ఉపాధి హామీ పథకం కింద 1.05 లక్షల కుటుంబాలకు గుర్తింపుకార్డులు ఉన్నాయి. జిల్లాలో 1.67 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, ఇందులో 2.73 లక్షల మంది కూలీలుగా ఉన్నారు. కాగా గత ఆర్థిక సంవత్సరంలో 1.02 లక్షల కుటుంబాలకు 150 రోజుల పాటు ఉపాధి కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, 0.79 లక్షల కుటుంబాలకు ఉపాధి చూపారు. దాదాపు లక్షకు పైగా కూలీలకు పథకం ద్వారా ప్రయోజనం ఉపాధి లభించగా, వారికి రూ.69.15 కోట్ల నగదును ప్రభుత్వం చెల్లించింది. అయితే జాబ్ కార్డులకు తగ్గట్టు కూలీలు ఉపాధిని పొందలేకపోతున్నారు. దీనికి ప్రధాన కారణం మహిళా కూలీల్లో చాలా మందికి కేవలం వ్యవసాయం పనులు మాత్రమే నేర్చుకొని ఉండడం, ఇతర భవన నిర్మాణాలు, కందకాలు తవ్వకం, సిమెంట్ పనులు చేయరాకపోవడమేనని అధికారులు, నిపుణులు పేర్కొంటున్నారు. అందుకే 50 శాతానికి పైగా నమోదిత కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ రంగంతో ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేస్తే 2.50 లక్షల మంది జాబ్‌కార్డు దారులకు ఏటా 150 రోజుల పాటు ఉపాధి లభ్యం అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సేద్య రంగానికి, రైతన్నలకు లబ్ధి

వ్యవసాయ రంగం, ఉపాధి హామీ పథకం రెండు అనుసంధానమైతే కూలీలకు ఉపాధి లభ్యం కావడంతో పాటు, సేద్య రంగానికి, ముఖ్యంగా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో రెండు పంట కాలాల్లో కలిపి దాదాపు 8 లక్షల ఎకరాల్లో భూమి సాగవుతోందని, రమారమి రెండు లక్షల మంది రైతులు, లక్షయాభై వేల మంది రైతు కూలీలు సేద్యరంగంపై ఆధారపడి ఉన్నారని వారు చెబుతున్నారు. రైతులకు పంటల సమయంలో కూలీల చెల్లింపు పెద్ద సమస్యగా మారిందని, కూలీలకు 25 శాతాన్ని ఉపాధి హామీ పథకంలో చెల్లిస్తే రైతులపై భారం తగ్గుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వ్యవసాయ వృద్ధితో ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని, దీంతో జిల్లా ఆర్థిక పరిపుష్టతను సాధిస్తుందని ఆర్థిక వేత్తలు పేర్కొంటున్నారు.

ఈ సారైనా కేంద్రం చట్టం చేసేనా..!

ఎనిమిదేండ్ల క్రితం నీతి అయోగ్ నేరుగా కేంద్ర ప్రభుత్వానికి సూచన చేసినా, వ్యవసాయ రంగం, ఉపాధి హామీ పథకం అనుసంధాన ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ దిశలో చర్చ జరిపి చట్టం రూపొందించలేదు. తెలంగాణ సీఎం హోదాలో కేసీఆర్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా, అసెంబ్లీ తీర్మానం చేసి పంపించినా, ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే ఉపాధి హామీ కూలీలకు ముఖ్యంగా మహిళా కూలీలకు ఉపాధి అందని ద్రాక్షగా మారుతున్న పరిస్థితుల్లో ఈ సారైనా కేంద్రం కరుణించాలని రైతులు, ఉపాధి హామీ కూలీలు ఆర్థిక వేత్తలు కోరుతున్నారు. చట్టం చేస్తే వచ్చే యాసంగిలో రైతులకు, రైతు కూలీలకు మేలు జరుగుతుందని అంటున్నారు.

కొనేవి తక్కువేనట!

- మారుతున్న ధాన్యం కొనుగోళ్ల అంచనా
- అంచనా వేసింది 4 లక్షల మెట్రిక్ టన్నులు
- కేంద్రాలకు వచ్చేది 2.50 లక్షలే..
- 1.50 లక్షలు దళారుల పాలు
- ఇప్పటి వరకు కొన్నది 62 వేల మెట్రిక్ టన్నులే..
- సన్న రకాల అంచనాలోనూ మార్పులు
- మొదట 1.07 లక్షలు
- ఇప్పుడు 50-60వేల మెట్రిక్ టన్నులే రావచ్చని అంచనా

ధాన్యం కొనుగోళ్లలో అధికారుల అంచనాలు మారుతున్నాయి. ఒక్క కరీంనగర్ జిల్లాలో దొడ్డు, సన్న రకం కలుపుకొని మొదట్లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావచ్చని అంచనా వేసిన అధికారులు, ఇప్పుడు 2.50 లక్షల వరకు మాత్రమే వచ్చే అవకాశం ఉంటుందని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కేంద్రాలు ప్రారంభించడంలో ప్రభుత్వం చేసిన జాప్యం కారణంగా 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు దళారులకు అగ్గువకు అమ్ముకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటి వరకు కేవలం 50,500 మెట్రిక్ టన్నులు దొడ్డు, 11,500 సన్న రకం ధాన్యాన్ని అధికారులు కేంద్రాల ద్వారా సేకరించినట్లు తెలుస్తోంది. మరో 2 లక్షలలోపు ధాన్యం సేకరించి ప్రభుత్వం చేతులు దులుపుకొనే ప్రయత్నంలో ఉన్నట్లు స్పష్టమవుతోంది.

కరీంనగర్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెబుతుండగా వాస్తవ పరిస్థితులు మరో విధంగా కనిపిస్తున్నాయి. కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన జాప్యం కారణంగా పెద్ద మొత్తంలో ధాన్యం దళారులపాలైంది. కరీంనగర్ జిల్లాలో ఈ పరిస్థితులు కండ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయి. నిజానికి అక్టోబర్ రెండో వారంలోనే జిల్లాలో వరి కోతలు పుంజుకున్నాయి. అప్పటికే కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం, ఒక్క కేంద్రంలో కూడా కొనుగోళ్లు జరపలేదు. ఈ నెల మొదటి వారంలో కొనుగోళ్లు ప్రారంభించే నాటికే రైతులు తమ ధాన్యాన్ని కేంద్రాల్లోనే అడ్డగోలు అగ్గువ ధరకు దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. సన్న రకాలపై క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఈసారి పెద్ద మొత్తంలో రైతులు సన్నాలు సాగు చేశారు. వారికి కూడా ప్రభుత్వం నిరాశే మిగిల్చింది. కరీంనగర్ జిల్లాలో చూస్తే 1,51,982 ఎకరాల్లో దొడ్డు రకం, 1,21,415 ఎకరాల్లో సన్న రకాలను రైతులు సాగు చేశారు. ఈ లెక్కన 3,17,980 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 2,48,623 మెట్రిక్ టన్నుల సన్నరకం చొప్పున 5.66 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ నివేదికలు ఇచ్చింది. రైతుల అవసరాలకు ఉంచుకోగా 25 వేల మెట్రిక్ టన్నులకుపైగా దొడ్డు రకం, 10 వేల మెట్రిక్ టన్నుల సన్న రకాలను జిల్లాలోని మిల్లర్లు, వ్యాపారులు కొనుగోలు చేయవచ్చని, మిగిలిన 2,92,222 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 1,07,778 మెట్రిక్ టన్నుల సన్న రకం కలిపి 4 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు రావచ్చని అంచనా వేశారు. ఇందుకు అనుగుణంగానే కేంద్రాలు ఏర్పాటు చేయడం, గన్నీ సంచులు, వాహనాలు సమకూర్చుకోవడం వంటి ఏర్పాట్లు చేసుకున్నారు.

1.50 లక్షల మెట్రిక్ టన్నులు దళారులకే..

కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించిన కారణంగా రైతులు పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా తమ ధాన్యాన్ని పెద్ద మొత్తంలో దళారులకు అడ్డగోలు ధరలకే అమ్ముకోవాల్సి వచ్చింది. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతులు విశ్వసించనట్లు తెలుస్తోంది. కోతలు అలా ముగియగానే సన్న వడ్లను రైతులు నేరుగా మిల్లర్లకు, దళారులకు విక్రయించుకున్నారు. కొనుగోళ్లలో ఆలస్యం కారణంగా రోజుల తరబడి నిరీక్షించిన రైతులు దొడ్డు రకం వడ్లను రూ.1,800, రూ. 1,850 క్వింటాల్ చొప్పున అడ్డగోలు అగ్గువ ధరకు అమ్ముకున్నారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు ఏ గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ రకానికి రూ. 2,300 ఎక్కడా వర్తించింది లేదు. కరీంనగర్ జిల్లాలో సుమారు 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దళారులు అడ్డగోలు ధరకు కాజేసినట్లు తెలుస్తోంది. అధికారులు అంచనాలు మార్చుకోవడమే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. మొదట 4 లక్షల మెట్రిక్‌టన్నుల అంచనా కాగా, ఈ నెలకు వచ్చేసరికి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు రావచ్చనే నిర్ధారణకు వచ్చినట్లు కనిపిస్తోంది. ఇందులో 1.90 లక్షల వరకు దొడ్డు రకం, మిగతా 60 వేల మెట్రిక్ టన్నులు సన్న ధాన్యం ఉంటుందనే అంచనాకు వచ్చారు. ఇందులో కేవలం 50,500 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 11,500 మెట్రిక్ టన్నుల సన్న రకం మాత్రమే కొనుగోలు చేశారు.

జోజో.. లాలి జో!

కరీంనగర్‌లో బిడ్డను నిద్ర పుచ్చుతున్న తండ్రి శంకర్

కోరుట్ల : తల్లి కవిత పరీక్ష రాసేందుకు వెళ్లగా చిన్నారిని ఆడిస్తున్న బంధువు

జోజో.. లాలి జో...అమ్మ వచ్చే దాకా హాయిగా నిద్రపో.. అంటూ పసిపిల్లలను జోకొట్టే దృశ్యాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు గ్రూప్-3 పరీక్షా కేంద్రాల వద్ద ఆదివారం దర్శనమిచ్చాయి. తల్లులు పరీక్షకు వెళ్లడంతో తండ్రులు, వారి కుటుంబ సభ్యులు పసిపిల్లలను జోల పాడుతూ.. ఆడిస్తూ.. నిద్ర పుచ్చుతూ గడిపారు. కాగా, కరీంనగర్‌లోని సిద్దార్థ స్కూల్ పరీక్ష కేంద్రం వద్ద శంకర్ తన కొడుకును జోకొట్టి నిద్రపుచ్చుతున్న ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో 'భార్య ఎదుగుదలలో భర్తల పాత్ర అమోఘం' అటూ నెటిజన్లు కితాబునిస్తున్నారు.

-కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 17

సీఎం పర్యటనను అడ్డుకుంటాం

- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి

తెలంగాణచౌక్, నవంబర్ 17 : పెండింగ్‌లో ఉన్న బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుంటే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనను వేలాది మంది బీసీ విద్యార్థులతో కలిసి అడ్డుకుంటామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ హెచ్చరించారు. కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు పరిష్కరించలేదని ఆరోపించారు. ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేదని మండిపడ్డారు. పెండింగ్‌లోఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు.